సర్కారు బడులు సక్సెస్

- 'పది'లో అద్భుత ఫలితాలు
- 'కార్పొరేట్'కు దీటుగా రాణించిన విద్యార్థులు
- 'నాడు–నేడు'తో స్పష్టమైన మార్పు
- తల్లిదండ్రుల హర్షాతిరేకాలు

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అద్భుత ప్రగతి కనబరిచారు. కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా సత్తా చాటారు. గత ప్రభుత్వ హయాంలో సర్కారు పాఠశాలలను నిర్లక్ష్యం చేసి, కార్పొరేట్‌కు ప్రాధాన్యమిస్తే.. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గవర్నమెంట్ స్కూళ్లకు కోట్లాది రూపాయలతో సకల సౌకర్యాలు కల్పించడంతో పాటు అత్యున్నత ప్రమాణాలతో బోధనకు ప్రాధాన్యం ఇవ్వడంతో విద్యార్థులు వాటిని వినియోగించుకుని ఫలితాలు సాధించారు. పాఠశాలల ఉత్తీర్ణత శాతం కూడా అనూహ్యంగా పెరిగింది. ఇందుకు నిదర్శనం సోమవారం విడుదలైన పరీక్ష ఫలితాలే..


ఏయూ పాఠశాలల విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి


రత్నసావియా (584) తోట గరువు హైస్కూల్


రామ్‌చరణ్ (578) తోట గరువు హైస్కూల్


జయవర్ధన్ (529) శ్రీకృష్ణాపురం గురుకులం

ఆరిలోవ/ఏయూ క్యాంపస్: తూర్పు నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. ఉత్తమ మార్కులు సాధించి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిలిచారు. రూ.వేలల్లో ఫీజులు చెల్లించి సాధించలేని మార్కులను రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు సాధించి సత్తా చాటారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన సదుపాయాలు, ఉపాధ్యాయుల ఉత్తమ బోధనను విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారు. రాష్ట్ర విద్యాశాఖాధికారులు సోమవారం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి కార్పొరేట్ పాఠశాలలకు సవాలు విసిరారు. నియోజకవర్గంలో ప్రభుత్వానికి చెందిన ఐదు ఉన్నత పాఠశాలలున్నాయి. తోటగరువు జిల్లా పరిషత్, శ్రీకృష్ణాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులం, పెదవాల్తేరులో కేడీపీఎం, ఏయూ పరిధిలో ఇంగ్లిష్ మీడియం, తెలుగు మీడియం పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో 751 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాయగా.. 551 మంది ఉత్తీర్ణులయ్యారు.

తోటగరువు హైస్కూల్‌లో 67.4 శాతం ఉత్తీర్ణత

తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 67.4 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక్కడ 427 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. వారిలో 287 మంది ఉత్తీర్ణులయ్యారు. 584/600 మార్కులతో రత్నసావియా నియోజకవర్గంలో టాపర్‌గా నిలిచింది. రామ్‌చరణ్ 578/600 మార్కులు సాధించి పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన రెండో విద్యార్థిగా నిలిచాడు.

ఏయూ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 98.48 శాతం

ఏయూ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 98.48 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక్కడ 66 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. వారిలో 65 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 54 మంది ప్రథమ శ్రేణి సాధించారు. పాఠశాల విద్యార్థిని గాక్షాయణి 584 మార్కులు సాధించింది. 21 మంది విద్యార్థులు 500కుపైగా మార్కులు సాధించారు. 54 మంది ప్రథమ శ్రేణిలో, 11 మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు.

ఏయూ తెలుగు మీడియం స్కూల్‌లో 77 శాతం

ఏయూ తెలుగు మీడియం పాఠశాలలో 77 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక్కడ 53 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. వారిలో 41 మంది ఉత్తీర్ణలయ్యారు. ఇక్కడ ఎ.భవాని 511/600 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో అభినందించారు.

శ్రీకృష్ణాపురం గురుకులంలో 95.28 శాతం

శ్రీకృష్ణాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో 95.28 శాతం ఉత్తీర్ణత సాధించారు. గురుకులంలో 65 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. వారిలో 62 మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో 43 మంది ప్రథమ శ్రేణి సాధించారు. ఇక్కడ జయవర్ధన్ 529/600 మార్కులు సాధించి గురుకులం టాపర్‌గా నిలవగా.. 503 మార్కులు సాధించిన కిరణ్ పాఠశాలలో ద్వితీయ స్థానంలో నిలిచాడు.

కేడీపీఎం పాఠశాలలో 69.28 శాతం

కేడీపీఎం ప్రభుత్వ హైస్కూల్‌లో 69.28 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక్కడ 140 మంది విద్యార్థులు ఈ ఏడాది పరీక్షలు రాయగా.. వారిలో 97 మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో 578/600 మార్కులు సాధించిన జి.వర్షిత పాఠశాల టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా వర్షిత పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుమతీభాయి, తదితరులు అభినందించారు.

ఇంజినీరింగ్ చదువుతా..



మా నాన్న వరప్రసాద్ టైలర్. నా ఆసక్తిని గుర్తించి ఎంతో ప్రోత్సహించారు. పాఠశాలలో అధ్యాపకులు అందించిన మెరుగైన బోధన, శిక్షణ, ప్రత్యేక శ్రద్ధ వహించిన విధానం మంచి మార్కులు రావడానికి దోహదపడ్డాయి. ప్రస్తుతం ఐఐఐటీలో దరఖాస్తు చేసి ఎంపీసీ గ్రూప్‌లో చేరుతాను. ఇంజినీరింగ్ విద్య అభ్యసించాలనేది నా కోరిక. కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ చేస్తా.

– జి.వర్షిత,(578) కేడీపీఎం పాఠశాల

సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

తూర్పులో నాలుగు నామినేషన్లు


స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆర్‌వోకు నామినేషన్ పత్రాలు అందిస్తున్న రమణి

ఆరిలోవ: విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి సోమవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వీరిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా వెలగపూడి రామకృష్ణబాబు, వెలగపూడి సుజన రెండో సెట్ నామినేషన్లు వేశారు. వీరిద్దరూ ఈ నెల 19న మొదటి సెట్ నామినేషన్లు వేసిన విషయం తెలిసిందే. సోమవారం యువజన చైతన్య పార్టీ అభ్యర్థిగా యడ్ల వేణు గోపాలకృష్ణ, స్వతంత్ర అభ్యర్థిగా ఆరిలోవకు చెందిన ఆదాడ రమణి నామినేషన్లు దాఖలు చేశారు. వారి నుంచి ఆర్వో, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ నామినేషన్ పత్రాలు స్వీకరించారు. స్వతంత్ర అభ్యర్థి ఆదాడ రమణి నామినేషన్ వేయడానికి తమ మద్దతుదార్లతో ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు.

చిరుధాన్యాల 'హనుమంతుడు'


చిరుధాన్యాలతో రూపొందించిన హనుమంతుడి చిత్రంతో విజయ్‌కుమార్

ఏయూ క్యాంపస్: హనుమత్ జయంతిని పురస్కరించుకుని నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్‌కుమార్ చిరుధాన్యాలు వినియోగించి హనుమంతుడి చిత్రపటాన్ని తీర్చిదిద్దారు. దాదాపు 10 రోజులు శ్రమించి భారీ హనుమంతుడి చిత్రపటాన్ని జీవకళ ఉట్టిపడేలా ఆయన మలిచారు. మిల్లెట్స్‌కి ప్రాచుర్యం తీసుకువస్తూ, ప్రజల్లో వీటిపై అవగాహన కల్పించే ఉద్దేశంతో గతేడాది కాలంగా విజయ్‌కుమార్ ఇలా వందలాది చిత్రాలను తీర్చిదిద్దారు.

పటిష్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు


మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

సీతమ్మధార: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, అధికారులంతా సమన్వయంగా వ్యవహరించి, పటిష్ట చర్యలు తీసుకోవాలని తూర్పు నియోకవర్గ ఆర్వో, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. ఆశీలమెట్టలోని జీవీఎంసీ జోన్–3 కార్యాలయంలో ఎంసీసీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, వీవీటీ బృందాల నోడల్ అధికారులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. వివిధ అంశాలపై వారికి దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని, తనిఖీలు విస్తృతంగా నిర్వహించాలని, అన్ని కార్యకలాపాలపై నిఘా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

నేడు పోలమాంబ వార్షిక జాతర


పోలమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరు చుట్టు పక్కల 14 గ్రామాల ఆరాధ్య దైవం శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మంగళవారం జరగనుంది. మహోత్సవాల్లో ప్రధాన ఘట్టం అనుపు మహోత్సవానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాలలో భాగంగా సోమవారం స్థానిక మద్దివారివీధిలోని పెద్దిల్లు వద్ద తొలేళ్ల సంబరం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జాతరలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ఈవో కె.గాయత్రి తెలిపారు.

శోభాయమానంగా ఆలయ ప్రాంగణం

ఇప్పటికే అమ్మవారి ఆలయ రాజగోపురం, ప్రాంగణాన్ని రంగులు, పుష్పాలతో ముస్తాబు చేశారు. విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఉచిత ప్రసాదం, మంచినీరు, మజ్జిగ పంపిణీకి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. పిల్లలకు వేడిపాలు, బిస్కెట్లు అందించనున్నారు. ప్రత్యేక వైద్య శిబిరం అందుబాటులో ఉండనుంది. ప్రసాదాల విక్రయాలకు ప్రత్యేక, అదనపు కౌంటర్లను ఏర్పాటు చేశారు.

ప్రత్యేక క్యూలైన్లు

భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద చలువ పందిరి, ఆలయ ప్రాంగణంలో టెంట్‌లు ఏర్పాటు చేశారు. భక్తులకు వివిధ క్యూలైన్లను ఏర్పాటు చేసి ప్రత్యేక ప్రవేశాలు కల్పిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు ఉచిత దర్శనం, రూ.50, రూ.100, రూ.500 దర్శనాలు అందుబాటులో ఉంటాయి.

జోరుగా వైఎస్సార్‌సీపీ ప్రచారం


ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు సోమవారం భానోజీనగర్ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కర పత్రాలు పంపిణీ చేశారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను చేరువ చేసిన సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలన్నారు. ఇందు కోసం ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంవీవీ సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌అండ్‌టీతో బుల్లయ్య కళాశాల ఎంవోయూ


ఎంవోయూ పత్రాలు అందుకుంటున్న ప్రిన్సిపాల్ దీపక్ చౌదరి, ఎల్‌అండ్‌టీ బిజినెస్ హెడ్ ఫెబిన్

సీతంపేట: ఇంజినీరింగ్ విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు పెంచేలా డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల సోమవారం ఎల్‌అండ్‌టీ ఎడ్యూటెక్‌తో ఎంవోయూ చేసుకుంది. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ సమక్షంలో ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ దీపక్ చౌదరి, ఎల్‌అండ్‌టీ ఎడ్యూటెక్ కాలేజ్ కనెక్ట్ బిజినెస్ హెడ్ ఎం.ఎఫ్.ఫెబిన్ ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా దీపక్ చౌదరి మాట్లాడుతూ ఎల్‌అండ్‌టీ ఎడ్యూటెక్‌తో కలిసి ఫస్ట్, సెకండియర్ ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం కాలేజ్ కనెక్ట్ ప్రోగ్రాం, థర్డ్, ఫోర్తియర్ విద్యార్థులకు ఎంప్లాయిబిలిటీ, స్కిల్లింగ్ ప్రోగ్రాం ఇంటిగ్రేటెడ్ కోర్సుగా క్యాంపస్‌లో ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. మధుకుమార్ మాట్లాడుతూ ఎల్‌అండ్‌టీ కంపెనీ అందిస్తున్న ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా రాణించాలన్నారు. ఫెబిన్ మాట్లాడుతూ ఎల్‌అండ్‌టీ గ్రూప్ ఆఫ్ కంపెనీ బాగా గుర్తింపు పొందిన భారీ ఇంజినీరింగ్, నిర్మాణం, రియాల్టీ, క్యాపిటల్ గూడ్స్ తయారీ, ఐటీ రంగాల్లో ఉద్యోగావకాశాలకు అవసరమైన స్కిల్స్, టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. తద్వారా ఎల్‌అండ్‌టీ లేదా ఏ ఇతర కంపెనీలో అయినా ఉపాధి అవకాశాలు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీ ఎడ్యుటెక్ రీజనల్ మేనేజర్ మయాంక్ రంజన్, కళాశాల ప్రిన్సిపాళ్లు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

1 నుంచి గ్రూప్–2 మెయిన్స్ కోచింగ్ ప్రారంభం

డాబాగార్డెన్స్: అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్న గ్రూప్–2 స్టడీ సర్కిల్ నుంచి ప్రిలిమ్స్‌లో 98 శాతం మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరందరికీ సోమవారం విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు వి.ఎస్.పద్మనాభరాజు, డాక్టర్ బి.గంగారావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్ నిర్వాహకురాలు డాక్టర్ జి.ప్రియాంక మాట్లాడుతూ పోటీ పరీక్షల శిక్షణ సామాన్యులకు అందుబాటులో ఉంచే ఉద్దేశంతో నడుస్తున్న ఈ కేంద్రంలో ఇంతటి ఉత్తీర్ణత శాతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రూప్–2 మెయిన్స్ కోచింగ్ మే ఒకటి నుంచి ప్రారంభం కానుందని, ఆసక్తి గల అభ్యర్థులు 83745 37181, 88865 78595 నంబర్లలో సంప్రదించాలని కోరారు. రెండు నెలల పాటు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు కోచింగ్ ఇస్తామని, గ్రూప్ చర్చలు, మోడల్ పరీక్షలు ఉంటాయన్నారు.

గృహిణి ఆత్మహత్యాయత్నం

ఆరిలోవ: ఆరిలోవ పోలీస స్టేషన్ పరిధిలో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాంధీనగర్‌కు చెందిన మమతశ్రీ సోమవారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కొన ఊపిరితో ఉన్న ఆమెను స్థానికులు విమ్స్‌లో చేర్పించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతోంది. ఆమెను భర్త, అత్తమామలు, ఆడపడుచు తీవ్రంగా వేధింపులకు గురిచేస్తుండడంతో ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న మమతశ్రీ తల్లిదండ్రులు, బంధువులు.. విమ్స్ వద్ద ఆమె భర్త అత్తమామలను నిలదీశారు. దీంతో వారి మధ్య వాగ్వాదం చేటుచేసుకొంది. మమతశ్రీ బంధువులు దీనిపై ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం మమతశ్రీ విమ్స్‌లో కొన ఊపిరితో ఉన్నట్ల సమాచారం.

సీఎం జగన్‌తోనే భావితరాల భవిష్యత్తు

- అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు
- మేము సిద్ధం సభలో వైఎస్సార్‌సీపీ తూర్పు అభ్యర్థి ఎంవీవీ


మేము సిద్ధం సభలో పాల్గొన్న ప్రజలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

బీచ్ రోడ్డు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావితరాల భవిష్యత్తు కోసం ఆలోచించి సంక్షేమ పథకాలు అమలు చేశారని వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. సోమవారం జీవీఎంసీ 22వ వార్డులో మేము సిద్ధం సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఎప్పుడైనా పిల్లల భవిష్యత్తు కోసం చంద్రబాబు గానీ, వెలగపూడి గానీ ఆలోచించారా? అన్ని ప్రశ్నించారు. సీఎం జగన్ మాత్రం గడిచిన ఐదేళ్లలో భావితరాల కోసం విద్య, వైద్య రంగంలో అనేక పెనుమార్పులను తీసుకువచ్చారని చెప్పారు. సీఎం జగన్ తన సుదీర్ఘ పాదయాత్రలో ఎంతో మంది పేదల కష్టాలను దగ్గరుండి చూసి, నవరత్న పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. జగనన్న ఇచ్చిన హామీలు దాదాపు వంద శాతం నెరవేర్చారన్నారు. ఇంటి వద్దనే పింఛన్ అందుకుని అవ్వతాతలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు తమకు నచ్చిన వారికే పెన్షన్లు మంజూరు చేసేవారని విమర్శించారు. చంద్రబాబు తన 14 ఏళ్ల పదవీ కాలంలో ఏ రోజు కూడా పేదవాడిని పట్టించుకోలేదన్నారు. కేవలం ఐదేళ్లలోనే సీఎం జగన్ ఎన్నో అద్భుతాలు చేశారన్నారు. తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికీ 30 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని, డ్వాక్రా రుణాలు నాలుగు విడతలుగా మాఫీ చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. 22వ వార్డులో రూ.54 లక్షల ఎంపీ నిధులతో షాదీఖానా, రూ.50 లక్షలతో యాదవ సామాజిక భవన నిర్మాణం చేపట్టామని చెప్పారు. గడిచిన ఐదేళ్లలో ఎటువంటి అవినీతికి తావు లేకుండా విశ్వసనీయమైన పాలన జగనన్న అందించారన్నారు. అవినీతి రహిత పాలన కావాలంటే రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామని ఎంవీవీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పి.వి.నారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, అల్లంపల్లి రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య, సేవా రంగాల్లో విప్లవాత్మక మార్పు

- 19వ వార్డు సిద్ధం సభలో వైఎస్సార్‌సీపీ తూర్పు అభ్యర్థి ఎంవీవీ


సిద్ధం సభకు హాజరైన జాలరిపేట వాసులు



మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: విద్య, వైద్య, సేవా రంగాల్లో రాష్ట్రం విప్లవాత్మక అభివృద్ధి సాధించిందని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. 19వ వార్డులో జాలరిపేటలో సోమవారం మేము సిద్ధం– మా బూత్ సిద్ధం పేరిట నిర్వహించిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా గత ఐదేళ్ల జగనన్న పాలన సాగిందన్నారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యారంగాన్ని మహోన్నతంగా తీర్చిదిద్దారన్నారు. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తేవడంతో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పించారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేటర్ వైద్యాన్ని ప్రజలకు చేరువ చేశారని చెప్పారు. జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు చేరాయన్నారు. దళారులకు తావులేకుండా సంక్షేమాన్ని నేరుగా లబ్ధిదారులకే సీఎం జగన్ అందించారని చెప్పారు. అందుకే ప్రజల గుండెల్లో జగన్‌మోహన్‌రెడ్డి నిలిచిపోయారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలంటే మరోసారి జగనన్న పాలన రావాలన్నారు. తాను తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి పేదజాలరిపేట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించినట్టు చెప్పారు. జరిగిందన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, సామాజిక భవనాలు ఇలా ఎన్నో సౌకర్యాలు ఈ ప్రాంతానికి కల్పించేందుకు కృషి చేసినట్లు తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు వార్డు ఓటర్లు కృషి చేయాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తూర్పు ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు రామచంద్రరావు, రాష్ట్ర కార్యదర్శి పీవీ నారాయణ, సినీ నటుడు జోగినాయుడు, సురేష్, దాసు, వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, పలువురు డైరెక్టర్లు, వార్డ్ ఇన్‌చార్జ్‌లు, మండల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత విశాఖకు కృషి


సైకిల్‌పై జీవీఎంసీకి వస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: వారంలో ఒక్క రోజు ప్రతి ఒక్కరూ ప్రజా రవాణాను ఉపయోగించి విశాఖ నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు నగర ప్రజలు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు. తన బంగ్లా నుంచి సోమవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పెరుగుతున్న కాలుష్య నియంత్రణకు వారంలో ఒక రోజు జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణా ఉపయోగిస్తున్నారన్నారు. ఎకో–వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో–జీరో పొల్యూషన్‌లో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు ఇప్పటికే చేపట్టిందన్నారు.

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ

మహారాణిపేట : అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఆంధ్రా మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ సోమవారం పానగల్ భవనంలో నిర్వహించిన వర్క్‌షాప్, మాక్ డ్రిల్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ అగ్నిమాపక శాఖ అధికారి డి. నిరంజన్ రెడ్డి ఫైర్ ఫైటింగ్– రెస్క్యూయింగ్ గురించి తెలిపారు. ప్లాస్టిక్ సర్జరీ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ మోహన్‌రావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి రేణుకయ్య, తదితరులు పాల్గొన్నారు.